కాళహస్తీశ్వర శతకము

SL No. 678

ధూర్జటి

13639

శ్రీరస్తు

శ్రీ

కాళహస్తీశ్వర శతకము

గ్రంథకర్త

మాదిరాజు రఘునాథరావు

కొత్తపేట – గుంటూరు

1940

సర్వస్వామ్యసంకలితము] [వెల ప్రతి ఒకటికి రు 0-2-0

26 JUN 1940
MADRAS
1244/1940
PN 0222
S/NO 59
C.78
9918

శ్రీరస్తు

శ్రీ

కాళహస్తీశ్వర శతకము

గ్రంథకర్త

మాదిరాజు రఘునాథరావు

కొత్తపేట — గుంటూరు

1940

[సర్వస్వామ్యసంకలితము] [వెల ప్రతి రు 0-2-0]

... OF THE REGISTRAR OF ...
26 JUN 1940
MADRAS

పీ ఠి క

ఈ శతకము, గుంటూరుగ్రామకాపురస్థులును, శివాలయ ప్రతిష్ఠాపకులును, వివిధగ్రంథంబుల రచించి యనేకగ్రంథముల కృతిఁబొంది యశంబు గాంచినట్టివారును, మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామివారి యుత్సవముల స్థిరముగా నుండుచలిపందిరి స్థాపించినవారును నగు మూదిరాజు రఘునాథరావుగారిచే రచింపబడినది.

ఇయ్యది మృదుమధురశైలితో, శబ్దసౌష్ఠవంబులతో, నుండి పాఠకమహాశయుల హృదయంబుల తనుపార్చుచున్నది.

ఈ కవి యిట్టిగ్రంథములు పెక్కులు రచించి శారదాపీఠమునఁ బుష్పములభాతి నుంతురని భావించెద.

ఇట్లు

రత్నాకరం అనంతాచార్యులు,

ఉభయభాషాప్రవీణ, శతావధాని.

గుంటూరు,
29-5-'40.

శ్రీరస్తు

శ్రీ కాళహస్తీశ్వర శతకము

శా. శ్రీమచ్ఛీతనగాత్మజాహృదయరాజీవాంబుజాతాప్త ! నీ
సామర్థ్యంబు నుతింప నాతరమె ? యీశా ! శంకరా ! భూరి దు
ష్కామాద్యంతక! నాదుదుష్కలుషసంఘాతంబుఁ బోనూడ్చి సు
క్షేమంబుల్ ఘటియింపుమయ్య దయతో శ్రీకాళహస్తీశ్వరా !

మ. క్రతువుల్ సల్పఁగవచ్చుఁ గుండలములున్ గర్ణంబులన్ దాల్చి దీ
క్షితులన్ వేరు వహింపవచ్చు నోరు నాక్షేపింపఁగావచ్చు స
ద్వ్రతముల్ పూనఁగవచ్చు వేద మెపుడున్ వల్లింపఁగావచ్చు నీ
క్షితి మి మ్మారయ దుర్లభంబగుఁగదా శ్రీకాళహస్తీశ్వరా ! 2

మ. పిడిగంట ల్మారయింపవచ్చు భరితాప్తిన్ జూపఁగావచ్చు వే
తడివత్తు ల్వెలిఁగింపవచ్చుఁ బెనుచిందం బూదవచ్చున్ సదా
బుడుతల్ డాసినఁ దోలవచ్చు మునులై పోవచ్చు నిన్నాత్మనుం
చెడియోగం బది దుర్లభం బగుఁగదా శ్రీకాళహస్తీశ్వరా ! 3

శా. యోగాభ్యాసులమంచుఁ బెంజెడలచే నొప్పారవచ్చుం గుల
త్యాగంబుల్ సలుపంగవచ్చు ఘనవేదాంతంబుచే బ్రహ్మముల్
లోఁగన్నాననిపల్కవచ్చుఁ బులితోలుం గప్పఁగావచ్చు నిన్
క్రీఁగంటం గనుభాగ్య మొందఁ దరమా శ్రీకాళహస్తీశ్వరా ! 4

శా. వాసింగాంచినవారణాసికిని బోవన్ వచ్చు భాగీరథిన్
దోసంబుల్ నశియింప మున్కలిడి యాతోయంబుఁ దేవచ్చుఁ గై
లాసంబందు వసించునిన్నుఁ గనఁగా లభ్యంబోకో ! ధాత్రిగౌ
రీసంస్తుత్యపదారవింద ! గిరిశా ! శ్రీకాళహస్తీశ్వరా ! 5

శా. కండల్ పెంచుట కాటికే యనుచు నొక్కండైన యోచింపఁ డా
కండ ల్మెక్కఁగఁ గోరి జంతువుల వే ఖండించుపాపాత్ములన్
ఖండించున్ యమధర్మరాజనుచు సుజ్ఞాను ల్వచింపంగఁ గూ
ర్మిం దెందంబున మిమ్ము నిల్పితిఁగదా శ్రీకాళహస్తీశ్వరా ! 6

శా. తంటాలాయె భవత్పదాబ్జయుగళధ్యానంబు లీరీతిగాఁ
గంటంజూచుచు నాదుపాపములు లెక్కల్ వ్రాయుటల్ చూడఁగా
నింటం గుంటెనకాఁడు గల్గినటులాయెన్ లోన నూహింపఁగా
రెంటం బోటుఘటిల్లె నేమి తెరువో శ్రీకాళహస్తీశ్వరా ! 7

శా. ఆశాపాశవివర్జితున్ విమలనిత్యానందసంధాయినిన్
గోశోద్బంధవిహీనుఁ జేయ కిటులన్ క్షోణిన్ మహాచింతలన్
నాశంబొందెడిదుష్టకాయమున జన్మంబెత్తఁగాఁ జేసి తో
శ్రీశాజాదినుతాత్మ ! నమ్మితి నినున్ శ్రీకాళహస్తీశ్వరా ! 8

శా. నీసేవారతి యెన్నఁ డబ్బునొ శివా! నిన్నెట్లు దర్శింతునో
కాసుంజేయనిదుష్టమానవుఁడనై కైలాస మేరీతి నే
యాసన్ జేరుదునో మదీప్సిత మికన్ వ్యర్థంబుగాఁ ద్రోచె నీ
చేసన్నన్ ననుఁ బిల్చి ప్రోవఁగదవే శ్రీకాళహస్తీశ్వరా! 9

శా. తానే బ్రహ్మమటంచుఁ దెల్పఁగలతత్త్వం బెంచలే కిట్లు లో
లోనన్ మిక్కిలి సిగ్గునొందితిని నీలోఁ జేర్పు మింకన్ దయన్
సూనుల్ విజ్ఞులు గాకయున్నఁ బితరుల్ శుద్ధాత్ములం చెంచరా?
ఛీ నా కేటికి నీశరీర మరయన్ శ్రీకాళహస్తీశ్వరా! 10

శా. ప్రాణాయామముఁ బట్టవచ్చు దళముల్ భక్షింపవచ్చు న్మహా
మౌనమ్మూని జపింపవచ్చుఁ బలుకర్మల్ పూనఁగావచ్చు ని
ర్మానుష్యాటవి నుండవచ్చు నిదురన్ మానింపఁగావచ్చునో
శ్రీనాథాంబక! మిమ్ముఁ గాంచఁదరమా శ్రీకాళహస్తీశ్వరా! 11

శా. వేదాంతంబులు నేర్పవచ్చుఁ బ్రజలన్ విభ్రాంతులం జేయుచుం
బాదాక్రాంతులఁ జేయవచ్చుఁ బరిశుభ్రస్ఫారతత్వంబులన్
మోదంబొప్పఁగఁ బాడవచ్చు నిను సంపూర్ణుం గనన్ లేరు నా
చేదోడై ననుఁ గావు మింక దయతో శ్రీకాళహస్తీశ్వరా ! 12

శా. నీసంకల్పమునన్ జగత్త్రితయమున్ నిర్మాణమయ్యెంగదా
యీసొందం బనియేల నీకుఁ జెపుమా హేలావిధిం బ్రోవ కీ
దోసా లెంచః దలంచితో ? యముఁడు నిర్ధూమాగ్నిచందంబునన్
జేసాచన్ గమకించఁడే పురహరా ! శ్రీకాళహస్తీశ్వరా ! 13

శా. భార్యామోహమునందుఁ జిక్కి రె యొరుల్? పాల్పిచ్చిరే మేనియం
దార్యాదేవికి నర్ధభాగ మగు దేహం బిచ్చి శీర్ష మ్మొగిన్
ధైర్యంబొప్పఁగ గంగ కిచ్చితివి; నీ తత్వంబు నూహింప ని
శ్శైర్యజ్జన్ముఁడనే! గజాజినధరా! శ్రీకాళహస్తీశ్వరా ! 14

శా. మేలుంజేసినఁ గీడు చేయఁదగనా ? మీనధ్వజుం డార్తి నీ
యాలున్ నీ విఁకఁ జెట్టఁబట్టుమని సూనాస్త్రంబు సంధించినన్
ఫాలాగ్నిన్ దరికొల్పి తత్క్షణమునన్ భస్మంబుగావించు నీ
శీలం బారయ భీతిగల్గెఁగదరా శ్రీకాళహస్తీశ్వరా ! 15

మ. దురహంకారులు లోకకంటకులునై ద్రోహంబుఁ గావించునా
శరసంఘంబుల రూపుమాపి జగముల్ శ్లాఘింప భక్తాళికిన్
వరముల్ కూర్మి నొసంగి ప్రోచునినుఁ గానన్ లేనిన న్నిట్టు ల
స్థిరబంధంబులలోనఁ ద్రోయకు మిఁకన్ శ్రీకాళహస్తీశ్వరా ! 16

మ. త్రిపురంబుల్ త్రుటిలో దహించితివి దైతేయావళిం గూల్చి నా
కపురాగారుల మెప్పుఁ బొందితివి మార్కండేయుఁ గాపాడి కో
పపరీతున్ యముఁ బాఱఁదోలితివి నీ వాత్సల్య మేమందు వై
రిపురాక్రాంతివిభంజనా ! త్రిణయనా ! శ్రీకాళహస్తీశ్వరా ! 17

శా. జ్ఞానాజ్ఞానులఁ బండితోత్తముల మూర్ఖస్వాంతులన్ మానులన్
నానాభూషణభూషితప్రభువులన్ నాదారులన్ మేదినిన్
బోనీకుండ లయింపఁజేతువఁట నీ పూర్వోత్తరం బెద్దియో
శ్రీనాథార్చిత ! కాననైతినిగదా శ్రీకాళహస్తీశ్వరా ! 18

శా. మాయాకల్పిత మానజాండమున బొమ్మల్గా మనుష్యాదులన్
జేయంజాలియు, వెండియున్ మడియఁగాఁ జేయన్ బనేమయ్య; నీ
వాయుష్యంబు లొసంగి యార్చుట విశుద్ధాత్మా ! భవత్కామ్యమో
శ్రేయోదాయకమో వినోదమొగదా శ్రీకాళహస్తీశ్వరా ! 19

శా. నీకారుణ్యమునన్ సమస్తజగముల్ నీరేజకీటాదులున్
లోకేశాదులు వృక్షముల్ నగములున్ లోకస్థులున్ పుల్గులున్
జోకన్బుట్టుచునుండ వాని నిటులన్ జోద్యంబు వాటిల్ల ను
ద్రేకం బేటికిఁబూని యార్చెదవురా శ్రీకాళహస్తీశ్వరా ! 20

శా. ఓడల్ బండ్లగు బండ్లు నోడలగు నెంతో నీకృపాలోకన
క్రీడావాప్తి పొసంగనేని; రజతాద్రిం జేర్చి నీభక్తు లే
జాడం ద్రిమ్మరుచుండిరో యచట వాసంబిచ్చి నన్ బ్రోవు మో
క్ష్వేడగ్రీవ ! జలంధరాదిహరణా ! శ్రీకాళహస్తీశ్వరా! 21

శా. ఈవిశ్వంభరయందు జంతునిచయం బేజాతి కాజాతిగా
నావిర్భావము గాంచుచుంటకు భవద్వ్యాపారసామర్థ్యమే
ప్రావీణ్యస్థిరహేతువయ్యె; నిదియున్ భావింప లోలోపలన్
శ్రీవిశ్వేశ్వర ! సర్వ మీవెగదరా శ్రీకాళహస్తీశ్వరా ! 22

శా. నీచారిత్రము నీదుభూతదయ వర్ణింపంగరా దంచు లో
నీచెంతన్ వసియించుకామ్యమున నే నీపూజ గావించితిన్
భూచక్రంబునఁ బాపముల్ సలుపునన్నుం గావు మింకన్ శివా !
చీ, చీ మూఢుఁడనై జనించితినిరా శ్రీకాళహస్తీశ్వరా ! 23

శా. నీసంకల్పవికల్పముల్ కపటముల్ నీనిర్దయాళుత్వముల్
నీసామర్థ్యము నీదుకృత్యములు నే నిక్కంబుగాఁ గాంచుటన్
నీసాంగత్యము నొల్ల కెన్నటికి నే నీచర్య లన్నింటి గా
రీసీమంతినికిన్ వచించి విడుతున్ శ్రీకాళహస్తీశ్వరా ! 24

శా. నీసామర్థ్యముఁ దెల్పునట్టిశ్రుతులన్ నే నెన్న డాలింపకే
దోసమ్ముల్ పచరించుచున్ దుద కిలన్ దుష్కీర్తులం గాంచితిన్
మోసంబాయెను దుఃఖసాగరమునందున్ మున్గితిన్ గాని నీ
చేసంజ్ఞం దరిఁజేర్పు నన్నుఁక దయన్ శ్రీకాళహస్తీశ్వరా ! 25

శా. ఆకల్లాడదు నీదుశాసనము లేకన్యంబునన్ మేదినిన్
నాకాధీశముఖామరవ్రజము నీ నానామృగానీక మీ
నీకారుణ్యము లేకెటుల్ తిరుగు వర్ణింపంగ నీమాయలన్
శ్రీకంఠా ! తరమే తపోనిధులకున్ శ్రీకాళహస్తీశ్వరా ! 26

శా. ఓ కైలాసనగాధిపా! ధరణి నీ యుచ్ఛ్వాసమే వాయువో
నాకల్లాడిన నద్ది గాలియని మే మానందముం గాంతుమో
నీకంటెన్ స్థిర మెద్దియున్ గలదె ? వాణీనాయకాద్యర్చితా !
చీకుల్ గందురె! చంద్రికాప్తి జగతిన్ ? శ్రీకాళహస్తీశ్వరా ! 27

శా. మే మెల్లప్పుడు సల్పుదుష్కృతమె గాంభీర్యంబునన్ మమ్ము నీ
భూమిన్ వ్యాధులరూపమై తవిలి రూపుల్మాపుచుండెంగదా
స్వామీ! దీనికి మందు మీపదసరోజధ్యానమాఁ గాన మీ
చే మీఁదన్ ఘటియింప సౌఖ్యము లగున్ శ్రీకాళహస్తీశ్వరా! 28

శా. పాపాంభోనిధిలోఁ పలం బడి మహాబ్రహ్మప్రకీలాకృతిం
గోపమ్మూర్తిని యముండు గాల్చు ననిలోఁ గుందొందుచున్ మేము నీ
ప్రాంపుం గోరితి మింకఁ ద్రోయక మమున్ రక్షింపు మోదేవ! యా
క్షేపం బేమిటికిఁ జేయు కేయెడ దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 29

శా. నీలో నైక్య మొసర్ప నింతభయమా నీమేనిభాగస్థురా
లేలా సమ్మతి నొందు? నొందకయె ని న్నేరీతి లోఁజేర్తునం
చాలోచించెవొ? యార్య మజ్జనని న న్నాయాసమొందించునే?
శీలస్వాంతయుఁగాదె? ప్రోవదె! దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 30

శా నాలో నే నిటుసంతసించెద భవన్నామస్వరూపాళికిన్
గాలాహిన్ గళమందు; చిచ్చు నుదుటన్ గాళోలమున్ గుత్తుకన్
గేలన్ శూలముఁ దాల్చి నీవు త్రిజగత్క్రీడాగతిన్ గిత్తపై
శ్రీలోలాంబక! సంచరింతు వనుచున్ శ్రీకాళహస్తీశ్వరా! 31

శా. ఏనా డెప్పుడు గౌరితోఁ గలసితో యెన్నండు కల్యాణమో
శ్రీనాథేంద్రసరస్వతీధవులు వీక్షింపంగ లేదండ్రు స
న్మౌనుల్ నీజననంబు నేయుగములోనన్ గాని విన్నారె? సం
క్షీణంబున్ జననంబు నీకుఁ గలదే? శ్రీకాళహస్తీశ్వరా! 32

శా. నీకున్ నాకు నభేదమంచు మదిలో నిక్కంబుగా నమ్మితిన్
లోకాతీతుఁడ వీవు లోకగతుఁడన్ లోలుండ నే మూఢుఁడన్
నీకున్ మ్రొక్కెదు నన్యుఁగొల్వ ననుచున్ నేఁబూనితిన్ దీక్ష; నన్
జేకొమ్మింతటనైన సత్కరుణతో శ్రీకాళహస్తీశ్వరా ! 33

శా. క్షీరం బే నభిషేకమున్ సలుప దాక్షిణ్యంబు రాదాయెఁ బో,
నీరూపంబును జూచి పై నుమిసి యెంతే గొల్పు చెంచున్ దయన్
రా రారమ్మని నంది నెక్కుమని వే రౌప్యాచలాగ్రంబునన్
జేరంజేసితి వెంతవెఱ్ఱివోరవో శ్రీకాళహస్తీశ్వరా ! 34

శా. మించెన్ నీదగుపక్షపాత మిటులన్ మాపుత్రులౌ భైరవ
క్రౌంచామిత్రగణేశదక్షరిపులన్ గాఢాయురారోగ్యముల్
గాంచన్ జేసి భవత్పదాశ్రితుల నిష్కారుణ్యముం జూపి శి
క్షించన్ జేసితి వేమనందు నకటా ! శ్రీకాళహస్తీశ్వరా ! 35

శా. కార్యాకార్యవిచారహీనులు నహంకారు ల్విజృంభించుచున్
శౌర్యప్రక్రియ నుండుదుర్జనులు సుజ్ఞానంబు బోధించుచున్
గ్రౌర్యం బెప్పుడు మాననట్టికుజనుల్ గ్రామాధిపుల్ గాఁగ నా
శిష్యక్త్రాదులు మూలలంబడి రహో శ్రీకాళహస్తీశ్వరా! 36

శా. లోకాతీత! నిరంతరంబు మది నాలోకించుచున్ భక్తితో
శ్రీకంఠా! నినుఁ గొల్చుభక్తులకు సుక్షేమంబు గాకుండునే?
వైకుంఠార్చితపాద పంకజ! నను న్వాత్సల్యముం జూపి వే
చేకొన్నన్ రజతాద్రిఁగాంతుఁగద, నే, శ్రీకాళహస్తీశ్వరా! 37

మ. పరముంగూర్చెడినీకథ ల్విని భయస్వాంతుండఁ గా కేను నీ
చరణాబ్జంబులు నమ్మి నాదుభవపాశం బూడ్చె దీవంచు నీ
స్మరణం జేయెడ సల్పునన్నుఁ గన వీ చాతుర్య మెట్లబ్బె? సు
స్థిరసత్కీర్తివిశాల! ప్రోవఁగదవే శ్రీకాళహస్తీశ్వరా! 38

శా. నీలీలామయమూర్తి లోకమునకుఁ నిత్యంబు సౌభాగ్యభా
గ్యాళిం గూర్చునటంచు మానసమునన్ ధ్యానించునే నిట్లు భ
వ్యాళిం బొందక మేదినిన్ వెతలపాలై పోవ మాట్లాడ వీ
శీలం బెక్కడ నేర్చినాఁడవో కదా శ్రీకాళహస్తీశ్వరా ! 39

మ. ధరణిన్ దాసుఁడు చేయుతప్పు లెపుడున్ దండంబుతోఁ జెల్లనం
గ రతీశాహిత! తావకాంఘ్రిల సమగ్రస్ఫారభక్తిన్ నిరం
తరమున్ గొల్చెడినాదు నేరము లెదన్ నిల్పంగ న్యాయంబె? సు
స్థిరమోక్షంబు నొసంగి ప్రోవుము దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 40

మ. వరుసన్ మానవజన్మ లీవసుమతిన్ వర్ణింప శేషాహికిన్
దరమా? చావులు నావిధిం గలుగు; నంతంబొందు మర్త్యాళి య
స్థిరసౌఖ్యాళికి దీర్ఘజీవిగతి నెంతే సంతసుబందు నీ
స్థిరమాయల్ తెలియం దరంబె? గిరిశా! శ్రీకాళహస్తీశ్వరా ! 41

మ. నరుఁ డొక్కం డిల నాటకై గడుల నందంబొప్పఁగా గీచి క్ర
మ్మఱ మాయించినరీతి లోకముల నేమంబొప్పఁ గావించి యె
త్తఱినో రూపణఁగించి నిల్తువు భవత్తత్వంబు చిత్రంబు సు
స్థిరకల్యాణగుణా ! ఘృణాజలనిధీ ! శ్రీకాళహస్తీశ్వరా ! 42

శా. కాలాహంకృతిభంజనాతిబలశోకధ్వాంతపద్మాప్త ది
క్పాలత్రాణ! పురాణపూరుష ! శివా ! గౌరీశ ! ఫాలానలా
భీలజ్వాలవిదగ్ధమన్మథ ! నరాభీష్టప్రదా ! శూలి! నీ
శీలం బెన్నఁదరంబె? యెరికయిన్ శ్రీకాళహస్తీశ్వరా ! 43

శా. స్వామీ ! నీకను మూసి కాలుఁడు నను న్సంహారముం జేయునో ?
యేమో వాగిలినంచు నెంచికొనెదో హీనుంబలెం గాంచితో
నీమాయల్ దెలియంగ నేరిక గునే ? నీ వింక డెందంబునన్
ప్రేమం బ్రోవవె? చంద్రమౌళి ! గిరిశా! శ్రీకాళహస్తీశ్వరా! 44

మ॰ నరకం బెయ్యది గర్భకూపమెకదా॰ నానాఘటశ్రేణిలోన్
నరు లుర్విన్ బశుపక్షిసంఘములకన్నన్ జ్ఞానవంతుల్గదా
హర! నీనామజపాప్తిచే భవముఁ బాయంద్రోయ రేమందు నే
స్థిరభక్తిన్ భజియింతుఁ బ్రోవవె దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 45

శా॰ కాకుల్ కోవెల లొక్కలై వెలయఁగాఁ గంఠస్వరంబు ల్వినన్
వీకన్ వేఱుగఁదోఁచినట్లు ధరణిన్ విద్వాంసులన్ మూఢులన్
శ్లోకార్థంబులు దెల్పఁగా నెఱుఁగుఁ డా సుజ్ఞాని; నీచుండు దా
శ్రీకంఠా! కను నిర్వ్వరన్ సమముగా శ్రీకాళహస్తీశ్వరా! 46

శా. కేకిన్ సృష్టియొనర్చు టెట్టులగునో గీర్వాణనాథార్చితా!
యీకెల్గాంచి భవన్మహామహిమ నే నెవ్వాఁడ వాక్రువ్వఁగా
నేకాలంబున నైదువన్నియల నీ వేరీతిఁ గల్పించితో
శ్రీకంఠా! మది నెంచ దుర్లభ మగున్ శ్రీకాళహస్తీశ్వరా! 47

శా. ఏకొంటెల్ నిను విష్ణుభక్తుఁడని బిట్టెగ్గాడి దూషింతురో
యాకూళల్ భవదీయకోపమున మన్నైపోరె ? నీమాయ వా
ణీకాంతాదు లెఱుంగఁజాలరుకదా నీవింక నన్నుం గృపో
ద్రేకం బొప్పఁగఁ బ్రోవుమయ్య గిరిశా! శ్రీకాళహస్తీశ్వరా ! 48

శా. వంతల్ మిమ్ములఁ గాననేరరుకదా బ్రహ్మాదిబృందారకుల్
ముంతల్ గైకొని మున్ను పుట్టినసుతుల్ ముష్టెత్తిజీవింపఁగా
సంతు న్వొండియుఁగోరుమూర్ఖునివలెన్ సంతోష మేపార నీ
చెంతన్ నిల్వఁదలంచి వేడుటరయన్ శ్రీకాళహస్తీశ్వరా ! 49

శా. ఆర్చెన్ దావకఫాలనేత్రశిఖి సూనాస్త్రుం; ద్రిశూలంబు ము
న్నోర్చెన్ ఘోరజలంధరాదికుల; నీయుగ్రేక్షణజ్వాలికల్
దీర్చెన్ లోకచయంబు; నీజపము నీదివ్యప్రదేశంబునన్
జేర్చెన్ భక్తుల; నిన్ను నెంచఁదరమే శ్రీకాళహస్తీశ్వరా ! 50

శా. రాదా నీదయ నాపయిన్ గిరిశ ! శర్వాణీశ ! భూతేశ్వరా !
వాదా దీనునితోడ; నవ్వరటరా ప్రాల్మాల నేలా ! భవ
త్ర్యాపదుర్భావము లస్మదాదులకు వేఁబ్రాప్తించినం జాలురా
చేదా నామొఱ; భక్తవత్సల ! శివా ! శ్రీకాళహస్తీశ్వరా ! 51

శా. ఔరౌరా గిజిగాఁడుపిట్ట తనగూఁ డారూఢిమై నల్లుటం
బారంజూచిన లోకమం దమితశిల్పప్రజ్ఞ గాఁదోఁచెడిన్
ఘోరాకారుఁడవై పులుంగులమదిం గూర్చుండి యెట్లల్లితో
చీరంజీరిచి చిత్రచిత్రములుగా శ్రీకాళహస్తీశ్వరా ! 52

శా. దారిద్ర్యాద్రిశతార ! నారదమునీంద్రస్తుత్య ! మూరారి దు
ర్వారాఘాంబుధిఘోరబాడబ ! శివా ! భక్తప్రపూజ్యాంఘ్రి! కే
యూరీభూతఫణీంద్ర ! శంకర! మహాయోగీశ్వరారాధ్య ! సు
స్మేరాస్యంబున నన్నుఁబ్రోవు గిరిశా ! శ్రీకాళహస్తీశ్వరా ! 53

మ. పరు లెవ్వారలొ ప్రాపుకల్గి రనియో పాలింపఁ బ్రాల్మాలియో
దురితాత్ముం గరుణింప దోసమనియో దుఃఖాంబుధిన్ ముంచి నా
మొర నిస్సార మొనర్పఁ బూనితివొకో భూతాత్మ! భూతేశ! వే
సిరులం గోరఁ, బరం బొసంగుము దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 54

శా. రంగద్విక్రమభీషణుండ వగునీరథ్యంబు గిత్తేకదా
సింగం బార్యకు వాహనం బగుట నీసిగ్గెల్లఁ దూలెన్ భువిన్
పొంగన్ మేను జయంబు గైకొని యశంబుల్ మీకుఁ గూర్పంగ నా
జిం గూల్చెంగద కాసరాసురవరున్ శ్రీకాళహస్తీశ్వరా! 55

శా. కాయంబుల్ జలబుద్బుదంబులు నలంకారంబులున్ రాజ్యముల్
జాయాపుత్త్రులు భోగభాగ్యములు సంసారాలు విద్యుల్లతల్
నీయాధ్యానమె మోక్షదాయక మిలన్ నిన్నెంచ శక్యంబె? నేఁ
జేయంబూనినపూజఁ గైకొను మిఁకన్ శ్రీకాళహస్తీశ్వరా! 56

శా. కల్పాంతంబన నెద్ది, మిత్తియు ననంగా నెద్ది, దుర్మార్గులం
గాల్పంజాలిన దెద్ది, నీనయనమే కాదయ్య; నీతో భువిం
బోల్పంజాలినవార లెవ్వ రిఁక సంపూర్ణుండ వీవేకదా
శిల్పప్రజ్ఞ రచింతు వెల్లజగముల్ శ్రీకాళహస్తీశ్వరా ! 57

మ. భవదంఘ్రిద్వయపాంసువుం దుడిచి నేఁ బాపిల్మల కేవేళలం
దవులన్ మ్రొక్కఁద, సేవఁజేసెదఁ గృపాధారేయతం జూడు మో
భవ! నాకెవ్వరు దిక్కు ? తండ్రివికదా పాలింపవా? శంకరా !
శివ! చిద్రూప! పురాంతకా! పశుపతీ ! శ్రీకాళహస్తీశ్వరా ! 58

మ. వ్యథలం దీర్పఁగ నిన్ను మానసములో ధ్యానించుచుండంగ దు
ర్వ్యథలం బొందఁగఁజేయ నీ కగునె? నీ వాత్సల్య మేమాయె? నీ
కథ లాలించెడిభక్తులంబలె ననుం గైలాసముం జేర్తువో
శిథిలంబొందనిరూప మేర్పఱతువో శ్రీకాళహస్తీశ్వరా ! 59

మ. మృదులంబౌ భవదాత్మ నొచ్చుననుచున్ మిథ్యావివాదంబులన్
మదమున్ దుర్వ్యవసాయమున్ విడిచితిన్ మారారి! నన్నింకఁ ద్రో
సెదవా నారకమందు? నెట్లయిన నిన్ సేవింతు; సిద్ధోషి నా
ర్చెదవా? నీ కిది న్యాయమా? తెలుపవే శ్రీకాళహస్తీశ్వరా! 60

శా. పూలన్ వేసిన రాల వేతువటరా భూశ్వభ్రముం జొచ్చినన్
జాలిన్ మాలినకీడు సేతువటరా సర్వేశ్వరా! బొమ్మనన్
దాలిన్ జేర్చినరీతి దేహ మెరియున్ దైన్యంబు పాదాయె నా
శీలంబుం గని నన్నుఁ బ్రోవుము దయన్ శ్రీకాళహస్తీశ్వరా! 61

శా. చీమం జంపఁగ శైలమెత్తుపగిదిన్ జేగంద్రగోడ్డంటఁ దా
దోషం జక్కనరించునట్టుల నఘస్తోమంబు పాల్సేసి న
న్నీమాడ్కిన్ దయలేక కష్టములచే హింసింప నేమందు? ని
స్సీమప్రాభవశాలి! దేవవినుతా! శ్రీకాళహస్తీశ్వరా! 62

శా. నాకుంగల్గినకీడు నామనమునన్ నాకర్మలబ్ధంబుగా
శ్రీకంఠా! తలపోతుఁ గావున ననున్ జెల్వొప్పఁ గాపాడి యీ
నీకారుణ్యము నాపయిం బొలయఁగా నీభక్తునిం జేయుచుం
జీకుంబంగువు కాకమున్నె కొనరా శ్రీకాళహస్తీశ్వరా! 63

మ. జననంబాదిగ నేఁబడద్దములు మత్స్వాంతంబునన్ వేడ్కతోఁ
జెనటుల్ సల్పినకృత్రిమంబు లిటులం జెండాడి నీభక్తిచే
ధనధాన్యాదుల నన్నిటి న్మఱచి నిర్ధ్యానించు నన్నింకఁ గా
చిన నీకీర్తికి భంగ ముండునె? శివా! శ్రీకాళహస్తీశ్వరా! 64

శా. ఓకందర్పమదాంతకా! శుభకరా! యోపార్వతీనాయకా!
నా కింకెవ్వరు దిక్కు? మేదినిఁగనన్ నాతప్పు సైరించుటో
లే కాకాలునిచండపాశముల నోలిం ద్రుంచుటో కూర్పుమా
శ్రీకంఠా! ననుఁ ద్రిప్పనేటి కిటులన్ శ్రీకాళహస్తీశ్వరా! 65

శా. మీచిత్త మ్మిఁక నాదుభాగ్య మని నే మిమ్మిట్లు యాచించితిన్
మీచేనైనసహాయమున్ సలిపి నామీఁదన్ గృపంజూపుమీ
నీచారిత్రము చిత్రమై వెలయు వర్ణింపంగ శక్యంబొకో
ఛీఛీ యాచకవృత్తి నింద్యముగదా శ్రీకాళహస్తీశ్వరా ! 66

శా. ధైర్యం బంతయుఁ గ్రుంగిపోయెఁగదరా దాక్షిణ్యముం జూపరా
క్రౌర్యం బింతటనైన నాపికొనరా కన్నీరు మాయింపరా
శౌర్యోదగ్ర ! భవద్గుణంబు లరయన్ శక్యంబె ? భూతేశ ! ని
శ్శైర్యత్వప్రభవ ! చెంతఁజేర్చుము దయన్ శ్రీకాళహస్తీశ్వరా ! 67

శా. ఆకాశంబున కెత్తి నేలఁబడవేయం జేతు లెట్లాడెరా ?
నాకంటెన్ బలులౌ చెనంటులను నెన్నన్ బ్రోవవే ? శంకరా !
యేకొంటెల్ చెవినాట నాపయిన నిశ్లేనిందలం దెల్పిరో
శ్రీకంఠా! యిఁకనైన మోక్ష మిడుమా శ్రీకాళహస్తీశ్వరా ! 68

మ. హరి యెవ్వానికి బాణమయ్యె నరులై రజ్జార్కు లెవ్వానికిం
గిరి చాపంబుగ నయ్యె సూతుఁ డజుఁడై కేరించె నెవ్వానికిం
దురగంబుల్ శ్రుతులయ్యె నట్టినిను నెందుం గొల్చెదంగాన నీ
స్థిరసాన్నిధ్య మొసంగు మింక దయతో శ్రీకాళహస్తీశ్వరా ! 69

మ. కరుణాసాగర ! భక్తవత్సల ! శివా ! గౌరీమనోనాయకా !
హర! నీనామజపంబు పాపసముదాయం బార్చు; నిన్నెంచ నా
తరమే! నిష్కపటాత్మభక్తజనసంతానంబుఁ గాపాడుసు
స్థిరమా దేవుఁడ వీవెకాక పరులే శ్రీకాళహస్తీశ్వరా ! 70

మ. అరయన్ సర్వచరాచరప్రతతి నీయాధారతన్ నిల్చు నీ
వరలిప్తైనను గండ్లుమూయు నెడ బ్రహ్మాండంబు క్షోభిల్లు నీ
ఖరఫాలాగ్నియె సర్వలోకచయమున్ గాల్పంగనోపున్ బళీ!
చెలువన్ నిల్పఁగ నీకె చెల్లుఁగదరా శ్రీకాళహస్తీశ్వరా ! 71

మ. భవవారాశిఁ దరింపఁజేయుటకునై ప్రార్థించున న్నింక నీ
భవనంబందున నిల్ప కీవిధమునన్ బాధింప నేమందు నో
శివ ! నీభక్తులలోన న న్నొకనిగాఁ జేర్పంగలేవా? వెసన్
జెవి నామాటలు నాటవా? కటకటా శ్రీకాళహస్తీశ్వరా ! 72

మ. తృణమైనన్ వెనువెంట రాదని భువిం దెల్విన్ విచారింప కీ
జననంబాదిగఁ బెక్కుదుష్కృతములన్ సల్పంబ్రయత్నించుచున్
ధన మార్జించి పరోపకారమెటులన్ స్వాంతంబునన్ లేనినన్
జెనటిం గూరిమి నింకఁ బ్రోవఁగదవే శ్రీకాళహస్తీశ్వరా ! 73

శా. పౌరల్ కాంచుటకైనఁ గూర్మినయినం బ్రాల్మాల కోశంకరా!
మారారీ! పురవైరి! శూలధర! సన్మానిస్తుతా! ధూర్జటీ !
కారుణ్యాకర! కాలకూటహరణా ! గౌరీశ ! భూతేశ్వరా !
శ్రీరామార్చితయన్నుఁ బ్రోతువుగదా శ్రీకాళహస్తీశ్వరా ! 74

శా. సాలం గప్పుకు నీకుఁ జుట్టరికమే చందంబునం గల్గెఁ ? జెం
చేలంచం బిడె! వారి కిచ్చి పర మట్టీమోదవారాశిలోఁ
దేలంజేసితి [illegible]రలం గటకటా దీనుండ నౌనన్ను దు
శ్శీలుం గా[illegible]వ దేటికో? పురహరా ! శ్రీకాళహస్తీశ్వరా ! 75

మ. యతులుం బ్రాసలు శబ్దలక్షణము లయ్యర్థ ! చూడలే దర్థవి
శ్రుతులుం నేర; భవత్పదాబ్జములకుఁ జోహారుఁగావించి యీ
గతి నీపై శతకం బొనర్చితి; సదా కారుణ్యభావంబునం
క్షితిపై నన్ను ననుగ్రహింపుము శివా ! శ్రీకాళహస్తీశ్వరా ! 76

శా. మావంశీయులకుఁ మదాప్తతతికిఁ మద్బంధుమిత్రాళికిఁ
దేవా ! తావకభక్తియుఁ ప్రభుత సందీప్తాయురారోగ్యముల్
ప్రావీణ్యంబునఁ గల్గఁజేయుమని నీ పాదాబ్జముల్ గొల్తు గా
రీవందార్యా! మదనాంతకా! పురహరా ! శ్రీకాళహస్తీశ్వరా ! 77

శా. ఆలింపందగు దిక్కుమాలినమనోవ్యాధిన్ మొఱల్వెట్టెదన్
బాలింపందగు భక్తవర్యుని ననున్ భారంబుగా దేయెదన్
వ్రేలాడంబడు కాయ యెంతయిన బర్వే తీగ కుర్వీస్థలిన్
శ్రీలోలాంబక! నిన్ను నే విడువరా శ్రీకాళహస్తీశ్వరా! 78

శా. ఏలా బాధలువెట్టినన్ వెఱతునా? యిష్టంబుగా నన్నిటన్
నీలోనం గలియంగఁ జేయుమని ధ్యానింతున్; మదీయేప్సితం
బోలిం దీర్పుము నేను భక్తుఁడను గానో, జాల మింకేల? నీ
శీలం బెన్నఁ దరంబె? యేరికయినన్ శ్రీకాళహస్తీశ్వరా! 79

మ. హర! నీనామజపంబుఁ జేయుజను లాహ్లాదంబునన్ నీదుమం
దిరముం జేరి సుఖంబుఁ గాంతు రనుచున్ నే నిట్లు నీనామసం
స్మరణం బేయెడ సల్పుచుంటి నిఁక నీసాన్నిధ్యముం జేర్పు నీ
స్థిరరూపంబుఁ దలంప నేరి కగునే! శ్రీకాళహస్తీశ్వరా! 80

శా. నీకంటెన్ ఘనుఁ డైనదేవు నెచటన్ నేఁజూడ లే దింతయున్
నీకారుణ్యమునన్ సమస్తభవికానీకంబు సేకూరు భ
ద్రాకారుండవు నిన్ను నే వినుతిసేయంజాల నన్నింక నో
శ్రీకంఠా! దయతోడఁ బ్రోవఁగదవే శ్రీకాళహస్తీశ్వరా ! 81

శా. భద్రాకార! భవన్మహామహిమలన్ వర్ణింప శక్యంబె ? నీ
రౌద్రంబుం గని లోకము ల్వణఁకు శర్వాణీమనోనాథ! శా
రోద్రేకంబున మిత్తిఁ గూల్చినమహాయోధుండవై వెల్గునీ
చిద్రూపంబును గాంచువారు కలరే శ్రీకాళహస్తీశ్వరా ! 82

శా. గంగాదేవి ధరించి మస్తకమునన్ గౌరీమహాదేవి న
ర్ధాంగంబందున నిల్పి యాసవతికయ్యం బూడ్చు నీవంటిదే
వుం గాంచంగల భాగ్యమేరికగు నోపుణ్యాత్మ ! సర్వేశ ! నీ
శృంగారంబు నుతింపశక్యమగునే శ్రీకాళహస్తీశ్వరా ! 83

శా. నీచారిత్రము సర్వఘోరదురితానీకంబుఁ బోకార్చు నా
నీచిద్రూపము గాంచువారికి శుభానీకంబు చేకూరు నా
నీచింతామృతవర్ష మామయదవాగ్నిం బట్టిచల్లార్చు గా
రీచిత్తాంబుజమిత్ర! కావుము నను్ శ్రీకాళహస్తీశ్వరా! 84

శా. నీలీలామయమూర్తి సంతసముతో నిత్యంబు సేవించు భ
క్తాళిం బ్రోచుచు వెంట నుందువని నే నాసక్తిమై నిన్ను నీ
లీలల్ ధ్యానమొనర్పఁబూనితిని బాలింపు నామీఁద నీ
శీలంబుం గొనియాడ నేరికగునే శ్రీకాళహస్తీశ్వరా! 85

మ. ఇల నిత్యాప్తుఁడ వీవెకాని మఱిలే రెవ్వా రెటన్; గాన నా
కలపర్యాప్తభవత్పదేష్టి బహువిద్యాపుష్టి కల్యాణ ని
ర్మలవిజ్ఞానయథార్థదృష్టి నిడి చేరందీయ కీరీతి గా
సిలఁజేయం బనియేమిటయ్య చెపుమా శ్రీకాళహస్తీశ్వరా! 86

మ. అరరే ! యెంతటిభాగ్యమో యిపుడు నీధ్యానంబుసేకూరె నా
దురితౌఘంబులు వాతె డెంద మతిసంతోషంబునం దేరె ని
ర్భరభద్రంబులు గూరె నింక నినుఁ జేరన్ సందియంబున్నె ? సు
స్థిరకైలాసనివాస ! నీదుభటుఁడన్ శ్రీకాళహస్తీశ్వరా ! 87

మ. అలరన్ ముద్దులు మూటఁగట్టఁగలనీయాకారమున్ లోచనం
బుల దర్శింపఁగ వేచియుండఁగఁ జలంబుంబూని నీదాసు ని
ట్టుల వీడం దగవౌనె నీకుఁ ? బలునీటుం గాంచునీరూపముం
జెలువారం గనఁజేయు మింకనయినన్ శ్రీకాళహస్తీశ్వరా ! 88

మ. నిగమంబుల్ నిగమాంతముల్ స్మృతులు వర్ణింపంగలేనట్టి నీ
సుగుణశ్రేణుల మానవుండనగు నే సొంపార నేరీతిఁ జె
ప్పఁగ నేర్తుం; దుదకెట్టులైన నుడువం బాల్గాంటి నీవింక మె
చ్చి గణింపంగదవయ్య నన్ను నెదలో శ్రీకాళహస్తీశ్వరా ! 89

శా. ఇష్టం బింతయు లేక డెందమున వహ్నిం ద్రొక్కి సంగాలున
ట్లష్టాత్మల్ నినుఁగొల్చి దుష్టు లిల దివ్యాంచద్భవత్స్థానముం
దృష్టింజెందుదురంచు నేనిటుల నీస్తోత్రంబు గావింతు నీ
సృష్టిం జిత్రములన్ నుతింపఁదర మే శ్రీకాళహస్తీశ్వరా! 90

మ. నలిఁ దా మే వ్రతరాజముల్సలిపి జన్మంబెత్తిరో తొంటి భ
క్తులు నీరూపముఁ గాంచి కాంచి బహుసంతోషంబునన్ లోని కో
ర్కుల నెల్లం బడయంగఁ గల్గిరని నేఁగూర్మి న్నినుం గొల్చెదం
జెలువారన్ ననుఁ జేర్పు నీదరి కిఁకన్ శ్రీకాళహస్తీశ్వరా! 91

మ. నెఱియన్ బెల్లము మీఁగడల్ చెఱకుతేనెల్ దుగ్ధముల్ కండచ
క్కెరలుం దియ్యనిపండ్లు వేడుకల భక్షింపన్ భవద్దివ్యనా
మరుచింబోలునె? కూర్మితో నిపుడు నామాటల్ చెవింబెట్టి నీ
స్థిరకైలాసముఁ జేర్పుమయ్య గిరిశా! శ్రీకాళహస్తీశ్వరా! 92

శా. నిన్నుంగాని మఱొక్కదేవు నెపుడున్ సేవింప నేఁగోరిమిం
గన్నారంగని కష్టము ల్వడెడుమార్కండేయుఁ గాపాడిన
ట్లన్నా ! నాదగు బాధలం గెడపి నీయవ్యాజకారుణ్యముం
జెన్నారం బ్రసరింపఁజేయవుకదా ! శ్రీకాళహస్తీశ్వరా ! 93

మ. తలఁపన్ నీనగుమోము నీవిమలనేత్రంబుల్ మహాదివ్యకాం
తుల రాజిల్లుభవత్కపోలముల నీతోరంపునెమ్మేని లీ
లలు వర్ణింపఁదరంబె ? ధాతకయినన్ లాస్యంబుఁగావించు నీ
చెలిమిం గాంచుట కే ధనాధిపతినే శ్రీకాళహస్తీశ్వరా ! 94

శా. నీవాజ్మాధురి నీమహాగుణములన్ నీభక్తవాత్సల్యమున్
నీవైశద్యమహాకృతిన్ సురలు వర్ణింపంగ లేరంచు నే
నేవేళ న్నిని కొల్చుచుంటి నిను నాయీతప్పులం గావుమీ
సేవింపం దగినట్టివాఁడవుకదా శ్రీకాళహస్తీశ్వరా ! 95

శా. కోపం బెట్టిటికిఁ దండ్రి! లోకమున భక్తుల్ పోవుమార్గంబె నీ
దాపుంజేర్పునటంచు నెంచి మది నీధ్యానంబుఁగావించు నా
తాపం బూడిచి నన్ను నీదరికిఁ జేర్పంజాల కీరీతి నా
క్షేపంబుల్ సలుపంగ నీకుఁదగునా ? శ్రీకాళహస్తీశ్వరా ! 96

మ. అవివేకంబున బంధుమిత్రవనితావ్యామోహగాంభీర్యపా
శవితానప్రతిబద్ధమానసులు నీసాన్నిధ్యముం జేరలే
క విశేషామయపీడితాత్ము లగుచుం గష్టాలపాలౌదు రో
శివ ! నన్నట్టులఁ జేయ కేలుము దయన్ శ్రీకాళహస్తీశ్వరా ! 97

మ. జవసత్వంబు లుడింగినట్టినను నీసాన్నిధ్యముం జేర్చి జ
న్మవిపాకంబుల నందఁజేయకుము నీనామంబు నేవేళలన్
స్తవముం జేయుదు మానసాబ్జమున; నీదాసుండఁగానా ? భువిన్
జెవికిన్ నామొఱ నాటదా ? పురహరా ! శ్రీకాళహస్తీశ్వరా ! 98

మ. స్మరణీయం బగునీదుమంత్రము సదా జప్త్మమండలిన్ బాపముల్
హరియించున్ సుకృతంబులం బరమకల్యాణంబులం గూర్చు దు
స్తరరోగంబులఁ గాల్చు ఘోరభవబంధం బాపుఁ గాఁబట్టి చె
చ్చెర మోక్షంబు నొసంగుమా నవునకున్ శ్రీకాళహస్తీశ్వరా! 99

శా. ఎన్నో భోగము లెన్నియో గృహము లెన్నెన్నో ధనశ్రేణు లె
న్నెన్నో రాజ్యము లున్న లోన నిను నూహింపంగ లేనట్టివా
రన్నా! నీదరిఁ జేరఁజాలరని నీధ్యానంబుఁ గావింతు నన్
జెన్నారన్ దయ జెంతఁ జేర్పుము శివా! శ్రీకాళహస్తీశ్వరా! 100

మ. అవనిం బావనమూర్తి రాజరఘునాథాఖ్యుండ, భక్తుండఁ, బు
ణ్యవిశేషంబులఁ జేసఁగన్న యలబగ్గాంబాబ్బరాజాత్మజుం
డ, విధిప్రాజ్ఞుఁడ జేచు నీశతక మానందంబు వాటిల్ల నో
శివ! నీ కంకిత మిచ్చితిం గొను మిదే, శ్రీకాళహస్తీశ్వరా! 101

గుంటూరు చంద్రికా ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడెను.

గుంటూరు

చంద్రికా ముద్రాక్షరశాలయందు

ముద్రించఁబడెను

13639